మహిళాభివృద్ధితోనే దేశాభివృద్ధి

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

రాంగోపాల్‌పేట్: ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా మహిళలు ముందుకు వెళ్తేనే సమాజం, దేశం ముందుకు వెళ్తుందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ పీజీ రోడ్‌లోని ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం హాల్‌లో జేసీఐ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కిషన్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు ముందుండాలనే ఉద్దేశ్యంతో ప్రధాని నరేంద్ర మోదీ అనేక పథకాలు చేపడుతున్నారన్నారు. అలాగే త్రివిధ దళాల్లో వేల మందికి అవకాశం కల్పించారని ఆయన అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొంతం దీపిక, సరళ, బీజేపీ నాయకులు శ్యాం సుందర్‌గౌడ్, రాజ శేఖర్‌రెడ్డి, పెద్ది రవీందర్, మేకల సారంగపాణి, కొంతం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ పోటీలు



ట్రోఫీలను అందుకుంటున్న వెటరన్ విజేత క్రీడాకారులు

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని ప్రొ.జయశంకర్ ఇండోర్ స్టేడియంలో రెండు రోజులుగా కొనసాగుతున్న డాక్టర్ టి. కృష్ణ మెమోరియల్ 2వ తెలంగాణ స్టేట్ వెటరన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో 120 మంది వెటరన్ క్రీడాకారులు పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో శశికుమార్, వెంకటరత్నం, తాహెర్, రామారావు, డా. రంగారావు, ఎస్. రమేష్, శ్రీనివాస్, జగన్నాథ్, సురేష్, దేవేంద్రనాథ్ తదితరులు విజేతలుగా నిలిచారు. అనంతరం అసోసియేషన్ నాయకులు గెలుపొందిన విజేతలకు బహుమతులు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వెటరన్ టేబుల్ టెన్నిస్ అసోషియేషన్ సెక్రటరీ విఠల్, ప్రసిడెంట్ దయాకర్, నవీన్‌కుమార్,సురేష్‌కుమార్, శ్రీనివాస్ తదితరులున్నారు.

బలమైన పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం

లాలాపేట: బలమైన పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం తార్నాక నాయకుడు తాళ్లపల్లి రాజు ఆధ్వర్యంలో పలువురు యువకులు సీపీఐలో చేరారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. పేద ప్రజలకు నిత్యం అండగా ఉండేది ఎర్ర జెండా మాత్రమే అని పేర్కొన్నారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొమరెల్లి బాబు, గౌరీ, నాగరాజు, శ్రీహరి, విక్కి, శ్రీకాంత్, శ్రీధర్,రాహుల్, చందు, వెంకటేష్, రమేష్ తదితరులున్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

తార్నాకలో హ్యూమన్ రైట్స్ డే వేడుకలు



శ్రీనాథచారిని సత్కరిస్తున్న తార్నాక నాగార్జున నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ బృందం


లాలాపేట: తార్నాక నాగార్జున నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, జ్ఞాన నిధి సేవా ట్రస్టు, మహిళా పతంజలి యోగా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం తార్నాకలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ డే వేడుకలు నిర్వహించారు. అసోసియేషన్ ప్రసిడెంట్ ప్రొ. టి. తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా తెలంగాణ మెడిటేషన్, అర్బిటేషన్ సెంటర్ హైదరాబాద్ ఫౌండర్ సెక్రటరీ డా. పి. అమితారాణి, గౌరవ అతిథిగా ప్రముఖ రచయిత, కవి డా. శ్రీనాథచారి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ జలంధర్‌రెడ్డి, అడ్వకేట్ యమున, అసోసియేషన్ ప్రసిడెంట్ డా. పి. మోహన్‌రావు, అసోసియేషన్ కార్యవర్గం పాల్గొన్నారు.

ఆహార మార్పులతో ఆరోగ్యకర జీవనం

సాక్షి, సిటీబ్యూరో: ఆహార మార్పులతో ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని పలువురు పోషకాహార నిపుణులు పేర్కొన్నారు. మంచి ఆహారం ద్వారా మనిషి మనుగడ బావుంటుందన్నారు. పోషకాహార ప్రాధాన్యం, వృక్షాధార డైట్ ద్వారా నాన్-కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సిడిలు)నిర్వహణపై..ఫిజీషియన్స్ అసోసియేషన్ ఫర్ న్యూట్రిషన్ (పిఎఎన్) ఇండియా ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని హయత్‌ప్లేస్‌లో సదస్సు జరిగింది. 29వ ఇన్-పర్సన్ కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ (సిఎమ్‌ఇ) పేరిట జరిగిన ఈ సదస్సు వైద్య నిపుణులు, పోషకాహార నిపుణులను ఒక వేదికపైకి తెచ్చింది. ఈ సదస్సులో మెడికల్ డైరెక్టర్ డాక్టర్ హేమలత, డా.రజీన షహీన్, డా. ప్రత్యూష నేరెళ్ల ఆధునిక పరిశోధనల ఫలితాలు సమర్పించారు. డాక్టర్ రాజేందర్ రామగిరి ఆధ్వర్యంలో డయాబెటిస్ రిమిషన్‌పై కేస్ ప్రెజెంటేషన్ చేస్తూ జీవన శైలి మార్పులతో వచ్చిన అద్భుత ఫలితాలను వివరించారు. ఐబిడి, శోగ్రెన్ సిండ్రోమ్ నుంచి రిమిషన్ సాధించిన ముగ్గురు రోగుల కేస్ స్టడీ, పోషకాహారం ద్వారా సాధించిన ఫలితాలను తెలిపారు. వైద్య రంగంలో పోషకాహారం సమగ్రతపై డాక్టర్ సుందీప్ లక్ఖాకియా నిర్వహించిన ప్యానెల్ డిస్కషన్‌లో చర్చించారు.

క్రిస్మస్ ప్రారంభ వేడుకల్లో మంత్రి పొంగులేటి

సాక్షి, సిటీబ్యూరో: క్రిస్మస్ ప్రారంభ వేడుకల్లో భాగంగా ఆదివారం సాయంత్రం సికింద్రాబాద్‌లోని మర్తోమా చర్చిలో జరిగిన వేడుకల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రిస్మస్ ప్రాముఖ్యత గురించి ప్రసంగించారు.



సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలి



కాచిగూడ: పాఠశాల విద్యాభివృద్ధి కోసం గత ఇరవై ఏళ్లుగా పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షలోని అన్ని విభాగాలలో దాదాపు 19,600 మంది కాంట్రాక్టు ఉద్యోగులు పని చేస్తున్నారని, ఏండ్ల తరబడి వారు చాలీచాలని వేతనంతో జీవితాలు నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులు ఉండనివ్వమని, అందరినీ రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏనాడూ వీరి సమస్యలు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఏన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తున్నారని, అదే విధంగా సమగ్ర శిక్ష ఉద్యోగులకు కూడా న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రతి ఉద్యోగికి 10లక్షల రూపాయల జీవిత బీమాతో పాటు ఆరోగ్య బీమా రూ.10 లక్షలు కల్పించాలని, ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు పదవీ విరమణ చేస్తున్న వారికి, చేసిన వారికి బెనిఫిట్స్ కింద రూ.25లక్షలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ విద్యాశాఖ నియామకాల్లో వీరికి వెయిటేజ్ కల్పించాలన్నారు. ప్రభుత్వం పాఠశాల విద్య అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని, సమగ్ర శిక్ష ఉద్యోగులతో వెంటనే చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లు పరిష్కరిస్తుందన్న నమ్మకం తమకుందన్నారు. ఈ సమావేశంలో బీసీ పొలిటికల్ జేఏసీ సలహాదారుడు పి. బడేసాబ్, గాలిగల్ల సాయిబాబా, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఇంద్రకంటి సరితగౌడ్, నవనీత గౌడ్, శ్రీవాణి, రమ్య, ఫరీన్, గిరిజా భవాని, మధురవాణి, మోహన్ సరస్వతి, షేక్‌పాషా పాల్గొన్నారు.

చదువు సాగేదెలా?

షెడ్ల కిందే చదువులు
- ఒకే గదిలో రెండు, మూడు క్లాస్‌ల నిర్వహణ
- సనత్‌నగర్ ప్రభుత్వ రౌండ్‌టేబుల్ పాఠశాల దుస్థితి



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

సనత్‌నగర్: సర్కారీ పాఠశాలలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. పాఠశాల నిర్వహణను గాలికొదిలేయడంతో ఇదేనా 'ప్రజాపాలన' అంటూ తల్లిదండ్రులు విమర్శలు గుప్పిస్తున్నారు. స్వీపర్లు లేక పాఠశాల ఆవరణలో చెత్త చెదారం పేరుకుపోయి అపరిశుభ్రం తాండవిస్తోంది. తరగతి గదులు సరిపడా లేకపోవడంతో విద్యార్థులు కూర్చునేందుకు కూడా ఇబ్బందిగా మారింది. చేసేదేమీ లేక రెండు, మూడు తరగతులను కలిపి ఒకే గదిలో కుక్కి విద్యాబోధన చేస్తున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థమవుతుంది. సనత్‌నగర్ ఎస్‌ఆర్‌టీకాలనీలోని ప్రభుత్వ రౌండ్‌టేబుల్ పాఠశాల దుస్థితి ఇది.

ప్రాథమిక పాఠశాల పరిస్థితి మరీ అధ్వాన్నం..

ఒకే భవనంలో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు కొనసాగుతున్నాయి. రెండు పాఠశాలల్లోనూ తెలుగు, ఇంగ్లీష్ మీడియాలు ఉన్నాయి. ఉన్నత పాఠశాలలో 285 మంది విద్యార్థులు ఉండగా వారి కోసం ఎనిమిది గదులు ఉన్నాయి. ఇందులో ఒకటి కంప్యూటర్ ల్యాబ్, ఆఫీసులకు ఉపయోగిస్తుండగా ఆరు గదులు ఉన్నాయి. గదులు సరిపోకపోవడంతో పైఅంతస్తులో షెడ్ల నిర్మాణంతో ఎలాగోలా తరగతుల నిర్వహణను నెట్టుకొస్తున్నారు.

- సమస్యల్లా ప్రాథమిక పాఠశాలదే. 220 మంది విద్యార్థులు ఉండగా కేవలం మూడు తరగతి గదులే ఉన్నాయి. ఇంకా ఆరు తరగతి గదుల అవసరం ఉంది.
- ఒకే తరగతి గదిలో రెండు మూడు క్లాస్‌లను నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో తరగతి గదిలో బెంచీలు సరిపోక కింద కూర్చోవాల్సిన పరిస్థితి. ఒక తరగతి గదిలో ఒకవైపు బెంచీలపై ఒక తరగతి, మరోవైపు బెంచీలపై మరో తరగతి, ఇక మధ్యలో నేలపై ఇంకో తరగతి నిర్వహించుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయంటే సమస్య తీవ్రత అర్థం చేసుకోవచ్చు.

దుర్వాసన

గత కొన్నేళ్లుగా ఈ పాఠశాలను శుభ్రం చేస్తున్న స్వీపర్ మానేసింది. అప్పటి నుంచి పాఠశాల ఆవరణలో అపరిశుభ్ర పరిస్థితులు తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. చెత్తా చెదారం ఒకవైపు..మూత్రశాలలు, మరుగుదొడ్ల క్లీనింగ్ లేక దుర్వాసన మరోవైపు.. తీవ్ర దుర్వాసనల నడుమ విద్యాభ్యాసం చేస్తున్నారు. ఆడపా దడపా స్వీపర్‌గా చేసేందుకు వస్తున్నా ఒక రోజు, రెండు రోజులు చేసి తమ వల్ల కాదంటూ వెళ్లిపోతున్నారు. దీంతో పాఠశాలను శుభ్రం చేసేవారే లేక అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు.



ఒకే గదిలో ఇలా మూడు తరగతుల విద్యార్థులు

సర్దుకుపోతున్నాం

మూడు తరగతి గదులతో పాటు షెడ్డులోనే సర్దుకుపోతున్నాం. ఇక్కడి పరిస్థితిపై ప్రజా ప్రతినిధులతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లాం. ప్రభుత్వం చిన్నారుల పరిస్థితిని చూసి వేరే చోట ప్రత్యేకంగా ప్రైమరీ స్కూల్ భవన నిర్మాణం చేస్తే తప్ప ఇక్కడి సమస్యకు పరిష్కారం దొరకదు.

– బ్రహ్మచారి, ప్రధానోపాధ్యాయుడు

నేటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు



సనత్‌నగర్: శ్రీహనుమాన్ దేవాలయంలోని శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి ధనుర్మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఈఓ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 14 మకర సంక్రాంతి, ఉత్తరాయణం ప్రారంభం వరకు నెల రోజుల పాటు స్వామి వారికి విశేష పూజలు జరుగుతాయని పేర్కొన్నారు.

డిప్యూటీ సీఎంగా మహేష్ కుమార్‌గౌడ్‌ను నియమించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: త్వరలో విస్తరించనున్న మంత్రి వర్గంలో తెలంగాణకు ఉప ముఖ్యమంత్రిగా టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్‌ను నియమించాలని కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీకి విజ్ఞప్తి చేసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచి పార్టీ కోసం పని చేసిన ఆయన గత ఎన్నికల్లో బీసీల ఓట్లు కాంగ్రెస్ పార్టీకి వేసేలా ప్రచారం చేశారని తెలిపారు. పార్టీలో గత 40 సంవత్సరాలుగా పని చేస్తున్న మహేష్‌కుమార్‌కు డిప్యూటీ సీఎం పదవీ ఇచ్చి 55 శాతం గల బీసీల మన్ననలను పొందాలని కోరినట్లు పేర్కొన్నారు.

ఉద్యమకారులను గుర్తించండి



ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిసిన ఉద్యమకారులు

అడ్డగుట్ట: తెలంగాణ కోసం పోరాటం చేసిన ఉద్యమకారులను గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ను కోరింది. ఆదివారం కమిటీ చైర్మన్ యాదగిరి ఆధ్వర్యంలో ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించారు. తెలంగాణ కోసం పోరాటం చేసి ఉద్యమకారులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందేలా చూడాలని వారు కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ప్రతినిధులు ప్రఫుల్ రాంరెడ్డి, సత్తెమ్మ, వెంకటలక్ష్మి, అరుణ, కమల, సరిత, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

లాలాపేట: తార్నాక డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్ మహిళా నాయకురాలు అనిత భర్త హరినాథ్(56) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే టి. పద్మారావు గౌడ్ ఆదివారం తార్నాకలోని వారి నివాసానికి ఆదివారం వెళ్లి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ మహిళా నాయకురాలు ముత్యాల గీతాదయాకర్, నేతలు సునీల్ ముదిరాజ్, మధుకర్, శివ, శ్రీనివాస్‌గౌడ్, పొన్నాల రాజు, అమర్ తదితరులున్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు

రసూల్‌పురా: కంటోన్మెంట్ లోని సికింద్రాబాద్ పీజీ కళాశాల్లో గ్రూప్ 2 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. పరీక్షా కేంద్రం వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు. ఉదయం 8.30 గంటల నుంచే అభ్యర్థులను పరిశీలించి లోపలికి అనుమతించారు. ఈ పరీక్షా కేంద్రంలో మొత్తం అభ్యర్థులు 840 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా కేవలం 332 మంది మాత్రమే హజరయ్యారు. 508 మంది గైర్హజరయ్యారు.

అమీర్‌పేట: ఎస్‌ఆర్‌నగర్‌లో గ్రూప్- 2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. శ్రీ ఆదర్శ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 450 మంది పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఎస్‌ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి నేతృత్వంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. అడిషనల్ డీసీపీ కృష్ణాగౌడ్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు.



ఎస్‌ఆర్‌నగర్‌లోని గ్రూప్-2 పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన అడిషనల్ డీసీపీ

ఉచిత అంబులెన్స్ సేవలు ప్రారంభం



ఉచిత అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ఉచిత అంబులెన్స్ సేవలను ఉపయోగించుకోవాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. ఆదివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన క్యాంప్ కార్యాలయం వద్ద సనత్‌నగర్‌కు చెందిన కిద్మత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ఉచితంగా అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం అన్నారు. సనత్‌నగర్ డివిజన్ ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సేవల కోసం 8096188429 నెంబర్‌ను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు నిస్సార్ అహ్మద్, సయ్యద్ అఖిల్, మైనార్టీ నాయకులు జమీర్, నోమాన్, వసీం, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

చిలకలగూడ: సీతాఫల్‌మండి కుట్టివెల్లోడీ ప్రభుత్వ ఆస్పత్రి నూతన భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి నిరుపేద రోగులకు అందుబాటులోకి తేవాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ కోరారు. ఈమేరకు పలువురు కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆస్పత్రి భవన నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. కుట్టివెల్లోడి ప్రభుత్వ ఆస్పత్రి నూతన భవన సముదాయ నిర్మాణానికి గత ప్రభుత్వం రూ. 12 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసూరి సునీత, లింగాని ప్రసన్నలక్ష్మీలతోపాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ఆస్పత్రి భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పద్మారావు, కార్పొరేటర్లు

భక్తిశ్రద్ధలతో దత్తాత్రేయస్వామి జయంతి వేడుకలు



దత్తాత్రేయ జయంతి వేడుకల్లో పాల్గొన్న బండ కార్తీక చంద్రారెడ్డి దంపతులు

చిలకలగూడ: సీతాఫల్‌మండి దత్తాత్రేయ స్వామి ఆలయంలో దత్తజయంతి వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విద్యుత్‌దీపాలు, పుష్పాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది స్వామివారిని పట్టువస్త్రాలతో అలంకరించారు. మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్ఛారణ మధ్య పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మాజీమేయర్ బండ కార్తీకరెడ్డి, బీజేపీ నాయకుడు బండ చంద్రారెడ్డిలు ముఖ్యఅతిథులుగా హజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిలకలగూడ వీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని దత్తాత్రేయ ఆలయంలో దత్త జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ నాగలీల, సభ్యులు శ్రీనివాస్, రాజుఆనంద్, మాధవన్, వివేకానంద, గోపాల్, రాము, బీజేపీ నాయకుడు వీరన్న పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో..రూపాయల్లో..) టమాటా.15, నల్లవంకాయ 23 పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 25, బజ్జీమిర్చి 18, క్యాప్సికమ్ 55, పచ్చ కాకర 31, పందిరి బీర 55, క్యాబేజీ 19, క్యారెట్ 37, దొండ 35, గుండుబీన్స్ 50, గింజ చిక్కుడు 40, గోకరకాయ 28, కీర 32, దోసకాయ 13, బీట్‌రూట్ 35, ఉల్లిగడ్డ 45, ఆలుగడ్డ 33, చామగడ్డ 35, మొరంగడ్డ 28, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4-5, ముల్లంగి 5-6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

అంబేడ్కర్ నగర్‌లో గ్యార్వీ షరీఫ్



గ్యార్వీ షరీఫ్ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ నెక్లెస్ రోడ్డు అంబేడ్కర్ నగర్‌లో ఆదివారం గ్యార్వీ షరీఫ్ వేడుకలు ఘనంగా జరిగాయి. పెద్ద ఎత్తున ముస్లింలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణశ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరై మాట్లాడారు. ఆధ్యాత్మిక మార్గంతో ప్రతి ఒక్కరూ సమాజ వికాసం కోసం పని చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఫరీద్‌ఖాన్, ఫరీపుద్దీన్, ఇమ్రాన్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

ఓయూ ఫ్యాకల్టీ క్లబ్ ప్రవేశ ద్వారం మార్పు ?

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని అధ్యాపకుల ఫ్యాకల్టీ క్లబ్ ప్రవేశ ద్వారాన్ని మార్చనున్నారు. ఈ ప్రాంతంతో కొత్తగా పరిపాలన భవనం ప్రహారీని నిర్మించినందున ప్రవేశ ద్వారానికి ఫ్యాకల్టీ క్లబ్‌కు వెనుకబాగాన స్విమ్మింగ్ పూల్ వైపునకు మార్చనున్నట్లు అధికారులు తెలిపారు. త్వరలో నిర్మాణ పనులు చేపట్టనున్నారు.



ఫ్యాకల్టీ క్లబ్ ప్రవేశ ద్వారం

దేశాభివృద్ధికి మహిళలే కీలకం



మేళాలో వస్తువులను తిలకిస్తున్న, శ్రీగణేష్

రసూల్‌పురా: కుటుంబంతో పాటు దేశం అభివృద్ధి చెందడానికి మహిళలే కీలకమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. తిరుమలగిరి బంజారానగర్ పార్కులో పలు కాలనీ మహిళల ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఏర్పాటైన మహిళా మేళాను శ్రీగణేష్ ప్రారంభించారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని అన్నారు. కుటీర పరిశ్రమలు నిర్వహించేందుకు చేయూతనిస్తోందని అన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ వైవీరావు, బోస్, నరసింహ వివిధ కాలనీల మహిళలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ చీర సుచిత్ర

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ పట్టణ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్యవైద్య మహా సభ ప్రతినిధులు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను ఆమె అభినందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు జగదీశ్వర్, సంస్థ ప్రతినిధులు సురేష్, శ్రీనివాస్, నరసింహారావు, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోట నీలిమకు పురస్కారం

సనత్‌నగర్: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమకు సామాజిక మార్పు రంగంలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఇండియన్ విమెన్ అచీవర్స్ అవార్డును అందించారు. ఇటీవల బెంగుళూరులో జరిగిన కార్యక్రమంలో ఆమెకు మణిహారిని రాజకుటుంబానికి చెందిన కుటుంబ సభ్యులు ఈ పురస్కారం అందజేశారు.



తప్పుడు పత్రాలతో బ్యాంకుకు టోకరా

ఇద్దరు మహిళలపై కేసు నమోదు

వెంగళరావునగర్: ఉద్యోగస్తులమని నకిలీ డ్యాక్యుమెంట్లు సృష్టించి బ్యాంకుకు టోకరా వేసిన మహిళలపై మధురానగర్ పీఎస్‌లో కేసులు నమోదయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... కూకట్‌పల్లికి చెందిన శ్రీదేవి తాను సాఫ్ట్‌వేర్ ఉద్యోగినని, ఇల్లు నిర్మించుకునేందుకు రుణం కావాలని స్థానిక వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌లోని సౌత్ ఇండియన్ బ్యాంక్ అధికారులు కలిసింది. గణేష్ అనే మధ్యవర్తి ద్వారా అపాయింట్‌మెంట్ లెటర్, జీతానికి చెందిన బిల్లులు బ్యాంకుకు సమర్పించింది. రూ.68 లక్షలు కావాలని దరఖాస్తు చేసుకోగా, అధికారులు రూ.67,88,324 రుణం మంజూరు చేశారు. అదేవిధంగా కుల్లా రాజేశ్వరి దుర్గారావు అనే మధ్యవర్తి ద్వారా ఫ్లాట్ కొనుగోలు కోసం రూ.46 లక్షలు కావాలని దరఖాస్తు చేసుకుంది. ఆమెకు రూ. 32,05, 573 రుణాన్ని బ్యాంకు అధికారులు మంజూరు చేశారు. అయితే వీరు రుణాలకు సంబంధించిన ఈఎంఐలు సరిగా చెల్లించడం లేదు. దీంతో అనుమానం వచ్చిన బ్యాంకు అధికారులు విచారణ చేయగా నకిలీ డాక్యుమెంట్స్ సమర్పించారని అని తేలడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.